క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

యాచారం: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. మండల పరిధి నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాలలో 1993–94 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న నాటి బాల్య మిత్రులు.. శుక్రవారం పాఠశాల వేదికగా సందడి చేశారు. చిననాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ కేరింతలు కొట్టారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనునాయక్

ఆమనగల్లు: జిల్లా పరిషత్ నుంచి మంజూరైన రూ.4 లక్షల నిధులతో సీసీరోడ్డును నిర్మిస్తున్నట్లు మాజీ సర్పంచ్ శ్రీనునాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధి రాంనుంతల గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు సరిత పంతునాయక్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శేఖర్, నాయకులు హుమ్లానాయక్, యాదయ్య, వినోద్‌కుమార్, దాసునాయక్, గోపాల్‌నాయక్, పీఆర్ఏఈ అభిషేక్, గ్రామ కార్యదర్శి బాలమల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి



సీఐ జగదీష్

మాడ్గుల: ఈ నెల 28న ఆమనగల్లు కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీఐ జగదీష్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. యాక్సిడెంట్లు, భూతగాదాలు, కొట్లాట కేసులు, చీటింగ్ తదితర కేసులను ఇరువర్గాలు మాట్లాడుకుని రాజీ పడాలని కోరారు. లోక్ అదాలత్‌ను కాక్షిదారులు వినియోగించుకొని, డబ్బును, సమయాన్ని ఆదా చేసుకోవాలని చెప్పారు.

గణనాథుడి మహాప్రసాదం



లడ్డూతో భక్తుడు గణేశ్‌గౌడ్ తదితరులు

ఇబ్రహీంపట్నం: వివేకానంద యూత్ ఆధ్వర్యంలో బొంగ్లూర్ గ్రామంలో కొలువుదీరిన గణపతి చేతిలోని లడ్డూను నిర్వాహకులు శుక్రవారం వేలం వేశారు. ఈ వేలంలో లడ్డూను రూ.1.50 లక్షలకు మాజీ సర్పంచ్ పల్లె గణేశ్‌గౌడ్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు గణేశ్‌ను సత్కరించారు.

ఘనంగా హిందీ దివస్



ప్రిన్సిపాల్ అమరావతిని సన్మానిస్తున్న పరమేష్ తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: హిందీ దివస్ వేడుకలను శుక్రవారం ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ భాష ఉపన్యాసం, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం హిందీ ఉపాధ్యాయురాలు శారద, ప్రిన్సిపాల్ అమరావతిని పీఆర్‌టీయూ నేతలు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పరమేష్, మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, మోడల్‌స్కూల్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి సన్మానం



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

కందుకూరు: విశ్వబ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకుడు తల్లోజు సాయికుమార్‌చారి కోరారు. ఈ మేరకు గురువారం రాత్రి ఆయన సంఘం నేతలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం సమస్యల గురించి విన్నవించారు.

బడికి వెళ్లేదెట్లా..

- బస్సులు లేక.. కాలి నడకనే పాఠశాలకు
- ప్రమాదం అని తెలిసినా కిక్కిరిసి ఆటోల్లో ప్రయాణం
- ఇదీ సర్కారు బడుల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారుల అగచాట్లు



కాలినడకన పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

మాడ్గుల: 'ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లలను చదివించండి. అన్ని వసతులు కల్పిస్తున్నాం. నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నాం' అంటూ విద్యాసంవత్సరం ప్రారంభంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తుంటారు. ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తుంటారు. కానీ.. రవాణా సౌకర్యం గురించి పట్టించుకోవడం లేదని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల నుంచి మండల కేంద్రంలోని బడికి వెళ్లాలంటే సరైన బస్సు సౌకర్యం లేక తమ పిల్లలను ప్రైవేటు బడిబాట పట్టిస్తున్నామని పేర్కొంటున్నారు. ఆర్థిక భారం అయినా.. ఇంటి ముందుకు వస్తున్న బడి బస్సులో ప్రైవేటు పాఠశాలలకు తమ చిన్నారులను పంపిస్తున్నామని వెల్లడిస్తున్నారు.

తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

సర్కారు బడుల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాలకు బడి వేళల్లో తగినన్ని ఆర్టీసీ బస్సులు లేక పోవడంతో తరగతులకు సకాలంలో హాజరు కాలేకపోతున్నారు. ఫలితంగా ముందుగా జరిగే పాఠాలను వినలేక పోతున్నారు. సమయానికి ఆర్టీసీ సర్వీసు లేక పోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి నష్టపోతున్నారు. ప్రమాదం అని తెలిసినా ఆటోల్లో కిక్కిరిసి గమ్యం చేరుకుంటున్నారు. ఇర్విన్ నుంచి మాల్‌కు వెళ్లే బస్సులు ప్రధాన రహదారిపై ఉన్న గ్రామాలకు తప్ప, మారుమూల పల్లెలకు రావడం లేదని, ఈ విద్యా సంవత్సరం నుంచి బస్సులు తిప్పడం లేదని ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫలితంగా సర్కారు బడులకు విద్యార్థుల సంఖ్య పెరగడం మాట ఎలా ఉన్నా.. కొరవడిన రవాణ సౌకర్యంతో నానాటికీ వారి సంఖ్య తగ్గిపోతుందని పేర్కొంటున్నారు. ఇదే విషయమై.. ఆర్టీసీ ఉన్నతాధికారులను వివరణ కోరగా.. రద్దీ ప్రాంతాలకు అదనపు ట్రిప్పులు తిప్పుతున్నామని తెలిపారు.

పట్టించుకోవడం లేదు



బడి వేళలకు ఆర్టీసీ బస్సు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇదే విషయాన్ని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ఆర్టీసీ అధికారులకు పలుమార్లు విన్నవించాం. అయినా ఎవరూ పట్టించుకోవటం లేదు. అధికారులు స్పందించి రవాణా సౌకర్యం కల్పించాలి.

– పర్వతాలు, ఇర్విన్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు



పాఠశాల పనివేళలో సంచరిస్తున్న పశువులు

పాఠశాల మైదానం.. మూగజీవాలకు ఆవాసం

ప్రహరీ లేక పశువుల సంచారం

కడ్తాల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణ మూగజీవాలకు ఆవాసంగా మారింది. బడికి ప్రహరీ లేక పోవడంతో మైదానంలో పశువులు, పందులు, కుక్కలు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. పశువుల పేడ తదితర వ్యర్థాలతో బడి ఆవరణ అపరిశుభ్రంగా మారింది. దీంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి విద్యాలయానికి ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మాడ్గుల: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలనని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కార్మికులతో కలిసి ఎంఈఓ కార్యాలయ సిబ్బంది లక్ష్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు 9 నెలలుగా వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. శ్రీలత, యశోద, రాములమ్మ, వెంకటమ్మ ఉన్నారు.

సైకిల్‌పై పోలీసుల పెట్రోలింగ్



కానిస్టేబుళ్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

కానిస్టేబుళ్లను అభినందించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: విజిబుల్ పోలీసింగ్, సైకిల్ పెట్రోలింగ్ చేస్తున్న పోలీసు సిబ్బందిని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అభినందించారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయానికి ఆయన వెళ్తుండగా.. సైకిల్ పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు తారాసపడ్డారు. ఈ సందర్భంగా తన వాహనాన్ని ఆపి.. వారి వద్దకు వెళ్లారు. పెట్రోలింగ్ ప్రాముఖ్యతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళా కానిస్టేబుళ్లు రమాదేవి, అశ్విని, మౌనికలను ఆయన అభినందించారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని పోలీసులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

'శ్రీపాతి' సేవలు చిరస్మరణీయం



వెంకట్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: విద్యాభివృద్ధికి దివంగత ఎంఈఓ శ్రీపాతి వెంకట్‌రెడ్డి అందించిన సేవలు మరువలేనివని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఎంఈఓ.. ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకట్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, కిషన్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

స్వచ్ఛత అందరి బాధ్యత



యాచారం: తమ్మలోనిగూడలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న జీపీ సిబ్బంది



ఆమనగల్లు: బొట్టుపెట్టి అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ కుసుమ మాధురి

- పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే.. ఆరోగ్యం బాగుంటుంది
- ఎంపీడీఓ కుసుమ మాధురి
- బొట్టుపెట్టి అవగాహన కల్పించిన ఎంపీడీఓ

ఆమనగల్లు/ఇబ్రహీంపట్నం: 'పరిసర ప్రాంతాలు బాగుంటే గ్రామం బాగుంటుంది. గ్రామం స్వచ్ఛతగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత' అని ఎంపీడీఓ కుసుమ మాధురి అన్నారు. ఆమనగల్లు మండల పరిధి శంకరకొండతండా, పులుగోనిపల్లితండా, ఆకుతోటపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీఓ పర్యటించారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పులుగోనిపల్లితండాలో గిరిజనులకు మరుగుదొడ్లు ఉన్నప్పటికీ.. బహిరంగ ప్రదేశాలను వినియోగిస్తుండటంతో వారికి బొట్టుపెట్టి అవగాహన కల్పించారు. ఎంఈఓ సర్దార్‌నాయక్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు జైపాల్, ఈదమయ్య, గ్రామ కార్యదర్శులు వినోద్, ప్రసాద్, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా యాచారం, చింతపట్ల, తమ్మలోనిగూడ తదితర గ్రామాల్లో ప్రత్యేక అధికారులు పర్యటించారు. పంచాయతీ సిబ్బందితో చెత్తాచెదారాన్ని తొలగింపచేసి రోడ్లను శుభ్రం చేయించారు. నీటి ట్యాంకులను కడిగిపించారు. పనులను ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పర్యవేక్షించారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి సందీప్ అన్నారు. మండల పరిధి చల్లంపల్లి గ్రామంలో స్వచ్ఛత హి సేవలో భాగంగా జీపీ సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు నీటి శుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. ఇందులో అశోక్, ప్రవీణ్ రెడ్డి, తిరుపతి రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సహకరించండి

కమిషనర్ అమరేందర్ రెడ్డి



చెత్తబుట్టలు పంపిణీ చేస్తున్న పుర సిబ్బంది

తుర్కయంజాల్: పరిసరాల పరిశుభ్రతకు పుర ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి కోరారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా నిర్వహించారు. మూడు రోజులుగా చేపట్టిన పనుల గురించి ఆరా తీశారు. అక్టోబర్ 2 వరకు జరిగే స్వచ్ఛతను విజయవంతం చేయాలన్నారు. అనంతరం పలువార్డుల్లో ర్యాలీ నిర్వహించారు. తడి పొడి చెత్త వేరు చేయడం, సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్త బుట్టలను పంపిణీ చేశారు.

పర్యావరణాన్ని పరిరక్షిస్తాం

ఇబ్రహీంపట్నం: స్వచ్ఛత హి సేవలో భాగంగా మంచాల మండల కేంద్రంలోని కేజీబీవీ హాస్టల్ విద్యార్థులతో ఎంపీడీఓ బాలశంకర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానవహారంగా ఏర్పడి పర్యావరణాన్ని పరిరక్షిస్తామని చిన్నారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉమారాణి, ఈజీఎస్ ఏపీఓ వీరాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: చల్లంపల్లిలో అవగాహన కల్పిస్తున్న జీపీ సిబ్బంది, నాయకులు

చీపురు చేతపట్టి..

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి అన్నారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా ఆమె స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా చీపురు చేత పట్టి.. అక్కడున్న చెత్తాచెదారాన్ని ఊడ్చారు. కమిషనర్ రవీంద్రసాగర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: చెత్తను ఊడుస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ స్రవంతి



నేడు ఇలా

పచ్చదనంపై గొడ్డలి వేటు

విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయంటూ.. చెట్ల నరికివేత

తుర్కయంజాల్: విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లను ఇష్టానుసారంగా నరికివేస్తే చర్యలు తప్పవని ఇటీవల కలెక్టర్ శశాంక హెచ్చరించారు. అయినా.. ట్రాన్స్‌కో అధికారులు పని తీరులో మార్పు రావడం లేదు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో పెరుగుతున్న మొక్కలు, ఏపుగా పెరిగిన చెట్లను శుక్రవారం ఆ శాఖ సిబ్బంది కొట్టివేశారు. చెట్ల కొమ్మలు తీగలకు అడ్డుగా ఉన్నాయని వాటిని పూర్తిగా తొలగించారు. కొన్నింటిని మొదళ్ల వరకు కూలదోశారు. దీంతో నిన్నమొన్నటి వరకు పచ్చదనంతో కళకళలాడిన రహదారి.. నేడు వెలవెలబోతోంది. ఇదే అంశంపై ఇబ్రహీంపట్నం డీఈ యాదగిరిని వివరణ కోరగా.. పరిశీలిన అనంతరం చర్యలు తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు.



నిన్న అలా..

జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక



సెలెక్ట్ అయిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తలకొండపల్లి: 68వ ఎస్‌జీఎఫ్ఐ జోనల్ స్థాయి క్రీడా పోటీలకు మండల పరిధి వెల్జాల్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎంపిక అయ్యారని పీఈటీ పరమేష్ శుక్రవారం తెలిపారు. ఇటీవల మండల కేంద్రం తలకొండపల్లిలో కబడ్డీ, గట్టుఇప్పలపల్లిలో ఖోఖో జోనల్ స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ టోర్నీల్లో వెల్జాల్ విద్యార్థులు గెలుపొందారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌లో ప్రవీణ్, వంశీ, ప్రియాంక, కీర్తి, పూజ, సన్నీ, చిన్న, నాగేందర్, భాను, మణికంఠ, కిరణ్, చందు, శివ, బన్ని, విఘ్నేశ్, శివశంకర్, పవన్, స్పందన, భవాని, అశ్విత, బార్గవి, దివ్యశ్రీ, తేజస్విని, శ్రీలక్ష్మిలు సెలెక్ట్ అయ్యారని పీఈటీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

కడ్తాల్: మండల పరిధి మైసిగండి దేవాలయ సమీపంలో శనివారం బీఆర్ఎస్ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కడ్తాల్ పట్టణానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు రావాలని పిలుపునిచ్చారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

అబ్దుల్లాపూర్‌మెట్: వార్డు పరిధి కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం 7వ వార్డు కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం వార్డులోని స్వగృహ కాలనీలో రూ.14లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

బడంగ్‌పేట్: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు వరమని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె మేయర్ చిగురింత పారిజాతతో కలిసి పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

3.8 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం

ఇబ్రహీంపట్నం రూరల్: అంతర్రాష్ట్ర మాదక ద్రవ్యాల ముఠా కేసును పోలీసులు ఛేదించారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన సంతోష్‌కుమార్ రావిర్యాల్‌లో అద్దెకు ఉండేవాడు. రెండేళ్లుగా హెచ్ఎఫ్‌సీఎల్ కంపెనీలో కేబుల్ లేబర్‌గా పని చేస్తున్నాడు. అధిక సొమ్ముకు ఆశపడి గంజాయి చాక్లెట్ల దందాకు తెరలేపాడు. మరో బిహార్‌వాసి బిరందర్‌సింగ్ నుంచి గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి ఇంట్లో డంప్ చేశాడు. పక్కా సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు దాడి చేయగా సంతోష్‌కుమార్ వద్ద 3.8 కిలోల గంజాయి చాక్లెట్లు లభ్యం అయ్యాయి. అనంతరం చాక్లెట్లతో పాటు మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సంతోష్‌కు చాక్లెట్లు విక్రయిస్తున్న వారిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సీఐ తెలిపారు.